



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్



కరువుపై అనంతపురం కలెక్టరేట్లో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర కరువు బృందం

నిన్న విన్నారు.. నేడు చూస్తారు...!

- ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన
- అనంత కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష
- ఉరవకొండ ప్రాంతంలో నేడు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రబీ 2023 పంటనష్టం పరిశీలనకు కేంద్ర కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేసింది. బుధవారం మొదటి రోజు అధికారులతో సమీక్షలో కరువు పరిస్థితుల గురించి సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో కరువు మండలాల్లోని పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం వరకు ఇది కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం నుంచి సత్యసాయి జిల్లాలోని రొద్దం మండలానికి ఒక బృందం, కర్నూలు జిల్లాకు ఒక బృందం బయలుదేరి వెళ్లింది. రాత్రికి తిరిగి అనంతపురం నగరానికే చేరుకుంది. ఈ బృందం గురువారం నాడు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరువూరు, కణేకల్ మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన జరపనుంది.

అధికారుల సమీక్షలో విన్నారు..

కరువు పరిశీలనకు వచ్చిన బృందానికి డిపార్టుమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌదరి, డిపార్టుమెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ చిన్మయ్ పుండ్లిక్ రావ్ గోత్మారేలు పాల్గొన్నారు. ఇక్కడ జరిపిన సమీక్షలో రాష్ట్ర స్థాయి పరిస్థితులను రెవెన్యూ డిజాస్టర్ మేనేజమెంట్ డైరెక్టర్ కూర్మనాథ్ వివరించారు. అనంతపురం జిల్లాకు సంబంధించి కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ వివరించారు. జిల్లాలో 14 మండలాల్లో కరువు నెలకొందని చెప్పారు. రబీలో 50 నుంచి 70 శాతం పంట నష్టం సంభవించిందని కేంద్ర కరువు బృందం దృష్టికి తీసుకెళ్లారు. 53,014 హెక్టార్లలో పంటనష్టం సంభవించిందని చెప్పారు. రూ.45.06 కోట్లతో ఇన్‌పుట్ సబ్సీడీకి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని వివరించారు. జిల్లాలో ఐదు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుంటే నాలుగు ట్యాంకుల్లో నీరు లేకుండాపోయిందన్నారు. వ్యవసాయానికి రూ.45.06 కోట్లు, పశుసంవర్ధక శాఖ కింద రూ5.38 కోట్లు, గ్రామీణ నీటిపారుదల కింద రూ.3.05 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై కింద రూ.3.17 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద రూ.78.60 కోట్లు, కలిపి మొత్తం రూ.135.26 కోట్లు నిధులు అవసరమని ప్రతిపాదించినట్లు కరువు బృందానికి వివరించారు. సమీక్ష అనంతరం కరువు బృందం సత్యసాయి జిల్లాలోని రొద్దం మండలంలో క్షేత్ర స్థాయి పర్యటన జరిపింది.

రొద్దం మండలంలో పర్యటన



ఆర్.కొట్టాల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృందం

రొద్దం : కేంద్ర కరువు బృందం బుధవారం మధ్యాహ్నం శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలో ఆర్.కొట్టాల, చెరుకూరు గ్రామాల్లో పర్యటించారు. 2023–24 రబీ సీజన్లో పప్పుశనగ సాగుచేసి పంట నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆర్.కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రీయ పథకాల అమలుపై సమీక్షించారు. చెరుకూరులో ఆవని సేంద్రీయ వ్యవసాయ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతుల ముఖాముఖిలో పాల్గొన్నారు. ఆర్.కొట్టాలకు చెందిన రైతు రమేష్, చెరుకూరు గ్రామానికి చెందిన రైతు నర్సింహ్మప్ప తదితరులు పంట నష్టంను కరువు బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు కేంద్ర బందంతో మాట్లాడుతూ 2023–24లో తాము సాగు చేసిన పప్పుశనగ పంటను పూర్తిగా నష్టపోయామని తెలిపారు. కనీసం పెట్టుబడులు కూడా చేతికందలేదన్నారు. ఎకరాకు రూ.12 వేల వరకు నష్టపోయినట్లు చెప్పారు. పొలం కౌలుకు తీసుకుంటే అదనంగా మరో రూ.5వేలు నష్టం వాటిల్లిందన్నారు. ఉపాధి పనులు కూడా సక్రమంగా జరగలేదన్నారు. బిల్లులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. పాడి రైతుల నుంచి పాలు కొనుగోలులో కూడా పాల కంపెనీలు మోసం చేస్తున్నాయని ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన పాడి రైతు రమేష్ తెలిపారు. అనంతరం కేంద్ర బందం లీడర్ రితేష్ చౌహాన్ మాట్లాడుతూ పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కేంద్ర కరువు బృందం సభ్యులు డాక్టర్ కె.పొన్ను స్వామి, సునీల్ దుబే, జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిపిఓ విజయకుమార్‌తో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నేడు క్షేత్ర స్థాయి పరిశీలన

కేంద్ర కరువు బృందం నేడు క్షేత్ర స్థాయి పర్యటన జరపనుంది. విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్ మండలాల్లో పర్యటించనుంది. పంట నష్టం పరిశీలన జరిపేందుకు అవకాశం లేనందున అక్కడి రైతులతో పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి స్థాయి పర్యటన ఉండనుంది. అనంతరం బృందం రాత్రికి బెంగళూరుకు చేరుకుని శుక్రవారం నాడు విజయవాడలో రాష్ట్ర స్థాయి అధికారులతో మరోమారు సమావేశం అవనున్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోండి
జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 29వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ సూచించారు. బుధవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణం ఉన్న జిల్లా జడ్జి ఛాంబర్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై అనంతపురం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్.వి, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అనంతపురం ఎస్పీ గౌతమి శాలి, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ.మాధవరెడ్డి, తదితరులతో జిల్లా జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అవసరమైన కృషి చేయాలన్నారు. ఫోక్సో కేసుల కింద నష్టపరిహారానికి సంబంధించి ముగ్గురు బాధితులకు రూ.1 లక్ష, రూ.2.50 లక్షలు, రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. బాధితులకు పరిహారం అందించేందుకు హైకోర్టుకు ఉత్తరం రాశామన్నారు.

ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌కు సన్మానం

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, ఇతర సమస్యల పట్ల స్పందనకు కతజ్ఞతగా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌ను జిల్లా జడ్జి కలెక్టర్, ఎస్పీల సమక్షంలో శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వజ్రకరూరు



బాధ్యతలు స్వీకరిస్తున్న పయ్యావుల కేశవ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభ కార్యాలయంలో బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా టీడీఎల్పీలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం శాసనసభ కార్యాలయంలో శాసనసభ వ్యవహారాల బాధ్యతలను స్వీకరించారు. శాసన సభ ఏర్పాట్లకు చెందిన ఫైల్స్‌పై తొలి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతున్న రానున్న శాసన సభ సమావేశాల్లో రాష్ట్ర అభివద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్థవంతమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జవాబుదారీతనంతో కూడిన పారదర్శకమైన పాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కషి చేస్తామన్నారు. శాసన సభ కార్యదర్శి పిపికె రామాచార్యులు, సంయుక్త కార్యదర్శి విజయరాజు, ఉప కార్యదర్శి కె.రాజకుమార్, పీఏవో కె.పద్మజ, స్టేట్ ఆడిట్ అధికారులు తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు తెలియజేశారు.

రైతు సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

రైతు సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తంగేడుకుంట పంచాయతీలోని 658 మంది శోత్రియ భూముల రైతులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేరుశనగ కాయల పంపిణీ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనక్కాయలు ప్రభుత్వం నుంచి అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు సకాలంలో పంటలు సాగు చేసుకుని అధిక పంట ఉత్పత్తిని సాధించాలని ఆకాంక్షించారు. రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందనే నానుడి నిజం కావన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. టిడిపి మేనిఫెస్టోలో కూడా రైతులను ఆదుకునేందుకు పంట పెట్టుబడి ఆర్థిక సాయం కింద ప్రతి ఏటా రూ.20 వేలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కష్టాల్లో ఉన్న రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. జగన్ పాలనలో రైతులకు కనీసం డ్రిఫ్, స్ప్రింకర్లు, వ్యవసాయ పరికరాలు కూడా అందించలేదన్నారు. వైసిపిది రైతు భక్షక ప్రభుత్వమని అభివర్ణించారు. మండలంలోని తంగేడుకుంట శోత్రియ భూముల రైతులకు రైత్వారీ పట్టాలను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ ఖరీఫ్ సీజన్లో పుట్టపర్తి నియోజకవర్గంలో 18391 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేసినట్లు తెలిపారు. తంగేడు కుంట పంచాయతీ పరిధిలోని 650 మంది రైతులకు 610 క్వింటాళ్ల వేరుసెనగను పంపిణీ చేస్తామన్నారు. రైతులకు సరిపడా విత్తన వేరుశన కాయలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, విత్తన కాయల కావాల్సిన రైతులు వ్యవసాయ యాప్ లో రిజిస్టర్ చేసుకుని ఆయా ఆర్‌బికెల్లో వేరుశెనక్కాయలు పొంది పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి లాయర్ రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, తహశీల్దార్ ఖాజాభి, వ్యవసాయ అధికారి ఇలియాజ్ , అంజినప్ప, శివశంకర్ రెడ్డి, శ్రీనివాసులు ,ఇతర శాఖ అధికారులు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండలంలో చౌడంపల్లికి చెందిన వెంకటేష్ కుమార్తె ప్రమీల అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం బలిజపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బికిలి అక్కులప్ప అనారోగ్య కారణంగా మృతి చెందిన నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తంగేడుకుంట గ్రామంలో అనారోగ్య కారణంగా మృతి చెందిన తలారి సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పెట్టా ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ జయచంద్ర, లాయర్ రాజశేఖర్, నాగరాజు, శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి జీవి రామలక్ష్మమ్మ, అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను కదిరి ఆర్డీవో వంశీకృష్ణ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు .



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న ఆర్డీవో

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం


విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం 25వ వార్డ్ కౌన్సిలర్ రాఘవేంద్ర తన వార్డులో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన శానిటరీ ఇన్స్ పెక్టర్, సచివాలయ కార్యదర్శులు కనీస చర్యలు సైతం చేపట్టడం లేదని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ వెంటనే తన చాంబర్ లో శానిటరి ఇన్స్ పెక్టర్ నిజాం, పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ సునీల్‌తో ఆయా విభాగాల కార్యదర్శుల పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు ఉదయం సమయంలో విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, పారిశుధ్య పనులను కనీస పరివేక్షణ సైతం చేయడం లేదని అన్నారు. దీంతో పారిశుధ్యం పూర్తిగా లోపించిందన్నారు. సకాలంలో విధులకు హాజరుకాని, పనులను పర్యవేక్షణ చేయనిసచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగానే ప్లానింగ్ సెక్రటరీలు వారికి కేటాయించిన పనులను సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ సునీల్‌ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులపై చర్యలు తీసుకోకపోతే, ఆయా విభాగాల అధికారులపై తాము చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మాజీ అమాత్యుల సిగపట్లు..!

- పెనుకొండ వైసిపిలో మళ్లీ గ్రూపు రాజకీయాలు
- ఓటమిలోనూ ఆధిపత్యం కోసం మాజీల పట్టు
- నియోజవకర్గంలో పోటాపోటీగా పర్యటనలు
- ఎటు వెళ్లాలో తెల్చుకోలేని పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి దారుణ పరాభవం మూటగట్టుకుంది. జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు అపజయం పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఓటమికి గల కారణాలపై ఆ పార్టీ నేతలు సమీక్షలు చేసుకుంటున్నారు. అయితే పెనుకొండ నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కన్పిస్తోంది. ఇక్కడి వైసిపి నాయకులు ఆధిపత్యం కోసం నువ్వా..నేనా అంటూ సిగపట్లుకు సిద్ధం అయ్యారు. ఇద్దరు మాజీ మంత్రులు అధిపత్యం కోసం కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ఓడిపోయిన నేతలిద్దరూ ఒక్క అడుగు కూడా వెనక్కు తగ్గకపోవడంతో వర్గపోరు ముదిరిపాకాన పడుతోంది.





ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఎన్నికల ఫలితాలు వచ్చి 15 రోజులు అవ్వకనే పెనుకొండ నియోజకవర్గంలో పట్టు కోసం మాజీ మంత్రులు మాలగుండ్ల శంకరనారాయణ, ఉషశ్రీచరణ్‌లు ఎవరికివారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇద్దరి నేతల మధ్య అధిపత్య పోరును చూస్తూ ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఇంత దారుణమైన ఓటమిలో కూడా ఒక నియోజకవర్గం కోసం ఇద్దరు మాజీ మంత్రులు ఎందుకు పట్టుపడుతున్నారు? అసలు అక్కడ ఏముంది అంటే కారణాలు బలంగానే ఉన్నాయి. పెనుకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా 2014కు ముందు నుంచి మాజీ మంత్రి శంకర నారాయణ ఉన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాటు జగన్మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగానూ ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న పెనుకొండ నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేయడంలో శంకరనారాయణ కష్టపడ్డారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి 2019లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయనకు సొంత పార్టీలోనే వ్యతిరేకత మొదలైంది. దీంతో 2024 ఎన్నికలకు ముందు శంకరనారాయణను పెనుకొండ నుంచి తప్పించి అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. అధినాయకుని మాట ప్రకారం అక్కడ పోటీ చేసి ఓటమి పాలైయ్యారు. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఉషశ్రీ చరణ్ రెండేళ్లపాటు మంత్రిగా పనిచేశారు. కళ్యాణదుర్గంలో ఆమె మీద తీవ్ర వ్యతిరేకత ఉండడంతో నియోజకవర్గాన్ని మార్చి పెనుకొండకు పంపారు. ఉషశ్రీ చరణ్ పెనుకొండకు కొత్త అయినప్పటికీ మూడు నెలల పాటు నియోజకవర్గంలో విస్తృతంగా కొంత పట్టు సాధించారు. ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నుంచి బరిలో నిలిచిన సవిత బలంగా ఉండడంతో ఉషశ్రీ దారుణమైన ఓటమి మూటకట్టుకున్నారు.

పట్టుకోసం ప్రయత్నాలు

ఎన్నికల్లో ఓటమి అనంతరం ఉషశ్రీచరణ్, శంకరనారాయణలు ఎవరిదారి వారు చూసుకుంటారని అందరూ భావించారు. అయితే ఈ అంచనాలు తప్పాయి. ఫలితాలు వెలువడిన 15 రోజులకే శంకరనారాయణ తిరిగి తన సొంత నియోజకవర్గం పెనుకొండపై పట్టు కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. పెనుకొండ నుంచే తన రాజకీయ భవిష్యత్తు చూసుకోవాలని ఆయన నిర్చయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కళ్యాణదుర్గం నుంచి వచ్చిన ఉషశ్రీచరణ్ వెనక్కు వెళ్లడానికి సుముఖంగా లేరు. పెనుకొండలోనే తన భవిష్యత్తు చూసుకోవాలని ఆమె కూడా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు నేతలూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ స్థానిక నాయకులను కలుస్తున్నారు. ఇటు శంకరనారాయణ అటు ఉషశ్రీచరణ్ ఇద్దరూ తిరుగుతూ ఉండటంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరి వెనుక నడవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఉషశ్రీ చరణ్ ఒక అడుగు ముందుకేసి తానే పెనుకొండ వైసిపి ఇన్‌ఛార్జిని అంటూ క్యాడర్‌కు చెబుతున్నారు. శంకరనారాయణ మాత్రం ఆమె తన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గంకు వెళ్తే బాగుంటుందని ఆయన సన్నిహితులతో అంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల శంకరనారాయణ అనంతపురం నుంచి పెనుకొండలోని తన స్వగృహంకు వచ్చిన నేపథ్యంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిశారు. దీన్ని జీర్ణించుకోలేని ఉషశ్రీ నియోజకవర్గంలో గ్రూపులు ఏర్పాటు చేసి పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారని శంకరనారాయణపై పార్టీ అధిష్టానాని ఫిర్యాదు చేసినట్లు గుసగుసలున్నాయి. పార్టీకి వ్యతిరేకంగా సమావేశాలు పెట్టవద్దని పార్టీ పెద్దలు శంకరనారాయణకు ఫోను చేయడంతో పెనుకొండలో తనకు సొంతిల్లు ఉందని, అందుకే తాను వెళ్లానంటూ వారికి తెలియజేశారు. మొత్తం మీదు పెనుకొండ వైసిపిలో పట్టుకోసం ఇద్దరి మాజీ మంత్రులు చేస్తున్న ప్రయత్నాలు ఎటు దారితీస్తాయోనని ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు చర్చించుకుంటున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో మాధవరాయ దేవాలయం ఆవరణంలో గ్రామ అభ్యుదయ మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు అడ్వకేట్ పావని రాయల్ ఆధ్వర్యంలో ఆశ్రమ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులచే గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పావని రాయల్ తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని నాగలగుబ్బ ప్రభుత్వ పాఠశాలలో 45 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని యూనియన్ బ్యాంకు లో విధులు నిర్వహిస్తున్న చంద్రకళ , గిరిధర్, దంపతులు పంపిణీ చేశారు. పలక ,నోట్ పుస్తకాలు, పెన్నులు, కలర్ పెన్సిల్లు, కం బాక్స్, బలపాలు, తదితర అభ్యసన వస్తువులను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అనురాధ, ప్రసాద్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మరకుంటపల్లిలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో సమాన హక్కులపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల అనంతరం ఈ గ్రామంలో దళిత మహిళపై జరిగిన దాడిని ఖండిస్తూ దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడానికి బహుజన చైతన్య వేదిక తన వంతు కృషి చేసిందని అన్నారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ఉన్నాయని వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండి ప్రజాస్వామ్యంలో ఎవరికి హాని చేయకుండా నిర్భయంగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, నాగార్జున, సూరి, కుమార్, మారుతి, రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల స్థలమార్పు

ప్రజాశక్తి - మడకశిర

ఐదు సంవత్సరాలుగా నెలకొన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి కేవలం పది రోజులలోపే ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ కాంట్రాక్టర్ లోకేష్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు రాజీవ్ గాంధీ సర్కిల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కన ఏర్పాటు చేసే విధంగా పనులు ప్రారంభించారు.

నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని తురకలపట్నం ఎంపిపి పాఠశాల నందు అదే గ్రామానికి చెందిన సవితమ్మ యువ సైన్యం శివానంద ఆధ్వర్యంలో దాదాపు 100మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. తాను చదువుకొన్న పాఠశాలకు తనవంతుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేసినట్లు శివానంద తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, గాజుల శ్రీరామ్, ప్రశాంత్ నాయుడు, రవి, రామాంజి, హనుమంత్, నరసింహ, నాగరాజు, హరి, టైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బిబిఎ, బిసిఎ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి తమ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు బీబీఏ, బీసీఏ కోర్సులలో చేరడానికి ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా అనుమతి పొందడం జరిగిందన్నారు. పట్టణంలో ఈ కోర్సులకు అనుమతులు పొందిన శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాల ఒక్కటే నన్నారు. కావున ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9014219361, 9000685031 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కూటమి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించడంతో మండల కేంద్రంలో కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక తేరు కూడలి నందు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కూటమి విజయంలో కీలక పాత్ర పోషించి, పిఠాపురం ఎమ్మెల్యేగా గెలుపొంది ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాసులు, సంజీవ రాయుడు, వెంకటరాముడు, ఈశ్వరప్ప, సతీష్, ఆకుల చంద్ర, మన్సూర్, బాలాజీ, శివ,సురేష్, జంగం వెంకటరాముడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు..

మంత్రులను కలిసిన ఎంపీ

ప్రజాశక్తి - సోమందేపల్లి

హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె. పార్థసారధి విజయవాడలో బుధవారం పలువురు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ. జనార్దన్ రెడ్డి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను ఈసందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి పయ్యావులతో ఎంపీ పార్థసారధి

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యం

కలెక్టర్ అరుణ్‌బాబు




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని 2047 నాటికి నిర్మూలించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ డే దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా వైద్య శాఖ అర్బన్ హెల్త్ సెంటర్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సికిల్ సెల్ ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. 40 ఏళ్ల మధ్య గిరిజనుల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ వ్యాధి నిర్మూలన కోసం ప్రపంచవ్యాప్తంగా అవగాహన దినోత్సవాన్ని పాటిస్తున్నారన్నారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వాళ్లకి ఈ వ్యాధి వస్తుందన్నారు. దీనిని నిరోధించేందుకు గిరిజనులకు స్కానింగ్ పరీక్షలు ప్రారంభించామని అందులో మొదటి దశ పూర్తి అయిందని అన్నారు. సకాలంలో ఈ వ్యాధి నిర్ధారించడం వల్ల చికిత్సను వెంటనే ప్రారంభించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధి తీవ్రంగా మారకుండా నిరోధించడమే ఉత్తమ మార్గమని కలెక్టర్ తెలిపారు. రక్త కణాలు సంఖ్య తగ్గడం (రక్తహీనత) కళ్ళు పసుపు రంగులో మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, ఒళ్ళు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచూ వచ్చే అంటువ్యాధులు, గర్భాధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, అవయవ వైకల్యం, పెరుగుదల సమస్యలు ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయన్నారు. ప్రతి ప్రాథమిక వైద్యశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు 40 ఏళ్లు ఉన్న వారందరూ చేయించుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ఎనుములపల్లి పిహెచ్‌సి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ మంజువాణి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు: వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహమైన సికిల్ సెల్ రక్తహీనత వ్యాధి పట్ల అవగాహన, జాగ్రత్త లేకుంటే ప్రాణాపాయమేనని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ రక్తహీనత దినం సందర్భంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులో మారడం, తీవ్ర కీళ్ల, ఒళ్ళు నొప్పులు, శ్వాసలో ఇబ్బంది, అలసట, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం ఈ వ్యాధి లక్షణాలని అన్నారు. జన్యుపరంగా తల్లిదండ్రుల నుండి చిన్నపిల్లలకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. సకాలంలో పరీక్షలు చేయించుకోవడం,సత్వర చికిత్స ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుభాషిని, దిల్షాద్, విజయ కుమారి,మురళి,అరుణ జ్యోతి,హేమ, అంజలి, రాధ, బషీరా, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కందికుంట స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా సంవత్సరం లో ప్రతి ఏటా విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలను బుధవారం కదిరి పట్టణంలోని వేమన బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద సాయం అందజేస్తుందని, అలాగే పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా పంపిణీ చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధను అందించాలని సూచించారు. విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రజకుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రజక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్లను బుధవారం సన్మానించారు. రజకులకు దోబీఘాట్, కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, నాయకులు బద్దలాపురం నరసింహులు, రామాంజినేయులు, ముత్యాలప్ప, మూర్తి, సాకేరమేశ్, రాధాక్రిష్ణ, మాల్యవంతం వెంకటేశ్, మురళి,రాజు, శీనప్ప, నాగరాజు, గణేశ్, బాలాజీ, భాస్కర్, అక్కులప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ పట్టణ అధ్యక్షుడిని సన్మానిస్తున్న రజకసంఘం నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధే ఆర్డీటీ లక్ష్యం

ఆర్డీటీ ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాల ఫెర్రర్



సమావేశంలో మాట్లాడుతున్న విశాల ఫెర్రర్

ప్రజాశక్తి - బత్తలపల్లి

వంటింటికే పరిమితమైన సాధారణ మహిళలే నేడు అసాధారణంగా రాణిస్తూ స్త్రీశక్తిని చాటుతున్నారని, ప్రతి మహిళ కోటీశ్వరురాలు కావాలన్నదే తమ ఆశయమని ఆర్డీటీ ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ అన్నారు. బుధవారం బత్తలపల్లిలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు రీజనల్ డైరెక్టర్ ప్రమీల అధ్యక్షతన చైతన్య మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశాల ఫెర్రర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆర్డీటీ నిర్వహణలోని పొదుపు సంఘాల సభ్యుల కోసమే మహిళా కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కళ్యాణదుర్గం,కూడేరు, కంబదూరు మండలాల్లో మహిళా కోఆపరేటివ్ బ్యాంకులు ఏర్పాటు చేశామని నాలుగవ బ్యాంకుగా బత్తలపల్లిలో ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమని అన్నారు. ప్రతి మహిళ లక్షాధికారి కావాలని కోరుకునే వారిమని నేడు ప్రతి మహిళా కోటీశ్వరురాలు కావాలని అన్నారు. పొదుపు సంఘాల సభ్యులచే నిర్వహిస్తున్న కో-ఆపరేటివ్ బ్యాంకులో అవసరమైన రంగాలకు రుణాలు తీసుకొని సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలోని బ్యాంకులలో రుణాలు తీసుకుని వడ్డీ చెల్లించడం వల్ల ఆదాయం కూడా ఆయా బ్యాంకులకే చెందుతుందని, మహిళలందరూ పెట్టుబడి పెట్టుకుని బ్యాంకు స్థాపించుకొని తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ఆదాయం కూడా ఆ మహిళా సభ్యులకే చెందుతుందని చెప్పారు. సంస్థ నిర్వహణలో 8500 పొదుపు సంఘాలలో లక్ష మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకుల చుట్టూ తిరగకుండా మన సభ్యులచే ఏర్పరచుకున్న బ్యాంకు లావాదేవీలను ఇంటి వద్ద నుండే నిర్వహించుకోవచ్చన్నారు. దాదాపు పలు బ్యాంకులలో రూ. 45 కోట్ల వరకు మన సంఘాల సభ్యుల పొదుపు డబ్బులు ఉన్నాయన్నారు. ఈ బ్యాంకు ద్వారా కుటుంబంలో ఏ చిన్న అవసరమైన రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ సొసైటీలో 558 మంది మహిళలు సభ్యులుగా చేరి దాదాపు 25 లక్షల రూపాయలను జమ చేసుకోవడం జరిగిందన్నారు.

ఉమెన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం : బత్తలపల్లిలోని ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉమెన్ కోపరేటివ్ సొసైటీ కార్యాలయాన్ని ఆర్డీటీ ఉమన్స్ సెక్టార్ డైరక్టర్ విశాల ఫెర్రర్ ఆర్డీ ప్రమీలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా 15 మంది బోర్డ్ ఆఫ్ మెంబర్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ హెచ్ఆర్డి ధనలక్ష్మి, అకౌంటెంట్ వుమన్ ఎంపవర్మెంట్ వెంకటేష్, ఎస్టిఎల్ సంజీవ్ కుమార్, బత్తలపల్లి ఏటిఎల్ ఆర్ రుక్మాంగద, సిఒలు నాగరాజు, తిమ్మరాజు, వెంకటేష్, అకౌంటెంట్ జయలక్ష్మి, కౌన్సిలర్ శోభరాణి తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న లంబాడి నాయకులు

1న గిరిజన సమ్మేళనం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

లంబాడి హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో జూన్ 1న పెద్ద ఎత్తున సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కైలాస్ నాయక్ తెలిపారు. బుధవారం ప్రశాంతి గ్రామ్‌లో ఆ సమితి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి నాయక్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ హెచ్ పి ఎస్ ఏర్పడి 27 ఏళ్ళు పూర్తి అవుతున్న సందర్భంగా జాతీయ గోర్ బంజారా సమ్మేళనం హైదరాబాదులో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి ఏపీలో లంబాడి హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాధాన్యతతో పాటు గిరిజనుల కోసం రావాల్సిన నిధులు గిరిజనులకే చెందాలన్న డిమాండ్లతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మా తండాలో మా రాజ్యం, ఎంతమంది ఉన్నామో అంతే వాటా నినాదంతో హైదరాబాదులో నిర్వహించే ఈ సమ్మేళనానికి పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నాయక్, జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ నాయక్, నాయకులు శంకర్ నాయక్, శివశంకర్ నాయక్, రంగనాథ నాయక్, గణేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, విశ్వనాధ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - సోమందేపల్లి

సత్యసాయి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ పథక సంచాలకులు లక్ష్మీ కుమారి పేర్కొన్నారు. బుధవారం పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం భువన విజయం సమావేశం భవనంలో జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖలో అంతర్భాగమైన జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక చట్టం,బాల్య వివాహాలు, చట్టాలపై మండల, గ్రామస్థాయి అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీ కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం గతంలో బాల్య వివాహాలను నిరోధించే అధికారులు సంఖ్య తక్కువగా ఉండేదన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 31,39 ల ప్రకారం వాటి సంఖ్యను పెంచారని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడన్నా జరుగుతున్నాయని తెలిస్తే 1098 లేదా 100 కు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిరోధక చట్టం మరియు ఆంధ్రప్రదేశ్ బాల్యవివాహాల నియమ నిబంధన గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిసిపిఒ మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ పథక సంచాలకులు లక్ష్మీకుమారి

వేలంతో పంచాయతీకి ఆదాయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కోడూరు పంచాయతీలో బుధవారం నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి ఆదాయం సమకూరింది. కోడూరు చెరువు రూ.5.13 లక్షలు, వారపుసంత 45500 రూపాయలకు వేలం పాటదారులు సొంతం చేసుకున్నారు. వీటిపై వేలం పాట దారులకు సంవత్సర కాలం పాటు హక్కు ఉంటుందని సర్పంచి మురళి, కార్యదర్శి నారాయణ స్వామి తెలిపారు.

భర్తపై భార్య కుటుంబసభ్యుల దాడి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శివానగర్‌కు చెందిన రవివర్ధన్‌పై ఆయన భార్య ధనలక్ష్మి, ధనలక్ష్మి తల్లి లక్ష్మీదేవి, చెల్లలు రూపలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు. రవివర్ధన్ ప్రైవేటు వాహనానికి డ్రైవర్‌గా వెళ్తున్నాడు. ఈయనకు హిందూపురం పట్టణానికి చెందిన ధనలక్ష్మీతో 8 ఏళ్లక్రితం వివాహమైంది. వీరి కాపురం కొన్నేళ్లు సాఫీగా సాగింది. ఈ మధ్యకాలంలో తరచూ భార్యభర్త గొడవ పడేవారు. దీంతో రవివర్ధన్ ధర్మవరం కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య ధనలక్ష్మి, భార్య తల్లి లక్ష్మీదేవి, చెల్లలు రూప హిందూపురం నుండి నేరుగా రవివర్ధన్ ఇంటికి బుధవారం వచ్చి ఆయనతో గొడవకు దిగారు .ఈ గొడవ కాస్త పెద్దదైంది. ఈ నేపథ్యంలో రవివర్ధన్‌పై ఆ ముగ్గురు దాడి చేయడంతో కుడికాలు, ఎడమ చేయికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన రవివర్ధన్ కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రవివర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కుటుంబసమస్యలతో ఓ బేల్దారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో చోటు చేసుకుం ది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...ఇందిరమ్మకాలనీకిచెందిన సల్మాన్‌ఖాన్ బేల్దారిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సల్మాన్‌ఖాన్, ఆయన భార్య అభియా కుటుంబసమస్యలతో ఒకరికొకరు వాదులాడుకున్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన సల్మాన్‌ఖాన్ తన ఇంటిలోనే సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు సల్మాన్ ఖాన్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంహెచ్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనాయతుల్లా మాట్లాడుతు కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పీరుసాబ్, రఫూఫ్ సాబ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రఫిక్, మహిళ నాయకురాలు వసుంధర, కార్యకర్తలు అబూజర్, అబూ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్లో గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో బర్తడే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని దానికి నిదర్శనమే సార్వత్రిక ఎన్నికల్లో అతి తక్కువ మెజార్టీతో బిజెపి కుతంత్రాలతో అధికారి పీఠాన్ని దక్కించుకుందని అన్నారు. భవిష్యత్తు కాంగ్రెస్‌దే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాయప్ప, వెంకటేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు డంపింగ్ యార్డులో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కౌన్సిలర్ నరసింహారాజు. సత్యసాయి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, నాయకులు అక్కంపల్లి బాబు తెలిపారు. బుధవారం పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను వారు పరిశీలించారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను జెసిబితో తొలగింపజేయించారు. డంపింగ్ యార్డ్‌లో పచ్చదనం పెంపొందించేలా పెద్దఎత్తున మొక్కలు నాటడానికి ప్రయత్నిస్తామని వారు తెలిపారు.

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా సిరాల చంద్ర

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హిందూపురం పురపాలక సంఘంలో వార్డు సంక్షేమ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సిరాల చంద్రను నియమించారు. ఈ మేరకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు జానీపాష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సిరాల చంద్ర మాట్లాడుతు గతంలో పాత్రికేయుడుగా పని చేసే సమయంలో ఎన్నో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు వచ్చానని. అదే అనుభవంతో సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు జానీపాషాకు చంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన కౌన్సిలర్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర మంత్రి సవితమ్మను హిందూపురం మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ దుర్గ మంజుళ బుధవారం కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో సవితమ్మను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈమెతో పాటు వార్డుకు సంబందించిన పలువురు మహిళ నాయకులు పాల్గొన్నారు.



మంత్రితో పురం మహిళా నాయకులు

పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా కూటమి నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు బొగ్గరం శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ అరాచక పాలన అంతమొందించడానికి పవన్ కళ్యాణ్ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రిగా, తనకు కేటాయించిన శాఖల ద్వారా ప్రజల మన్నన పొందుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతా దామోదర్, షామీర్, శ్రీనివాసులు, శేషు, రామంజి, రాము, మారుతి, రవి, బాలగంగాధర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు